# నోరు లేని దేవుళ్ళు

దెబ్బలాటలనేవి ప్రతినిత్యమూ ఎక్కడో అక్కడ, ఎందుకో ఒకందుకు జరుగుతూనే ఉంటాయి.

అన్నదమ్ముల మధ్య తగాదాల నుంచి దేశాల మధ్య జరిగే యుద్ధాల వరకూ, ఏవో కారణాలు ఉండి తీరుతాయి. అయితే ఆ రోజు ఉదయం, చింత తోపు చెరువుగట్టు మీద, గంగిరావి చెట్టు తిన్నె దగ్గర - ఊరి మధ్యనున్న రామాలయం పూజారి వరదాచారికి, ఊరి శివార్లలో ఉన్న గోగులమ్మ గుడి అర్చకుడు వెంకటస్వామికి ఎందుకంత పెద్ద దెబ్బలాట జరిగిందో ఎవరికీ అంతుపట్టలేదు.

పంచెలు పైకెగదోసి, జుట్టూ జుట్టూ పట్టుకొని, ఒకళ్ల మీద మరొకరు కలియబడ్డంతో, పది గంటలకు మొదలయిన ఆ దెబ్బలాట, చుట్టూ గుమిగూడిన జనం వినోదం కోసం అగ్నిలో పోస్తున్న ఆజ్యం వల్ల పన్నెండింటికి ముగిసింది. వళ్లంతా రక్కుల తోటీ, పీక్కుపోయిన ముఖాలతోటీ, వరదాచారీ, వెంకటస్వామీ ఎవరింటి వైపు వాళ్ళు వెళ్ళిపోయారు. అయినా వాళ్ల దెబ్బలాటకి కారణం జనానికి అర్థం కాలేదు. భోజనాల సంగతి మర్చిపోయి, గంగరావి చెట్టు తిన్నె మీద కూర్చుని చాలామంది, తర్జన భర్జనలు మొదలుపెట్టారు. ఒకళ్లతో మరొకళ్లకి ఏ విధమైన సంబంధమూ లేని వీరిద్దరి మధ్యా జరిగిన తగువులాటకి

రకరకాల కారణాలు ఊహించారు. చివరకు, అంతకు వారం రోజుల క్రితం జరిగిన అమ్మవారి ఊరేగింపులో జరిగిన ఓ చిన్న సంఘటన, దెబ్బలాటకు కారణమై ఉండొచ్చునని, నిర్ధారణకి వచ్చేశారు.

మునిమాపువేళ మేళతాళాలతో బయలుదేరిన అమ్మవారి ఊరేగింపు, రామాలయం దగ్గరకొచ్చేసరికి రాత్రి తొమ్మిదయింది. అమ్మవారి గరగని మోసే మనిషి కాళ్ల మీద నీళ్లు పోసి పానకం, వడపప్పూ, అడ్డెడు బియ్యమూ - పక్కనే వున్న కావిడి వానికి అందజేసి, గుడి మెట్లెక్కి నుంచున్నాడు వరదాచారి. ప్రతీఏడూ ఇది రివాజుగా జరిగిపోతోంది. వేషగాళ్ల గుంపూ, సన్నాయి మేళం, చాకలి తిప్పుడి తమాషా, బాండుమేళం - ఒక్కటొక్కటిగా రామాలయం ముందు ఆగుతూ కదిలిపోయాయి. చివరగా బోగం మేళం ఆగింది. గాస్ లైట్ల వెతుతుర్లో, తళ తళ మెరుస్తున్న దుస్తుల్లో, మంచి వయసులో వున్న వేశ్యలు నాట్యం మొదలుపెట్టారు. నల్లరాతి విగ్రహంలా నిల్చుండిపోయి, కళ్ళప్పగించి ఆ నాట్యంకేసి చూస్తూ వుండిపోయాడు వరదాచారి. వెంకటస్వామి పూటుగా తాగేసి జనాన్ని అదిలిస్తున్నాడు. నాట్యం ముగిసిన తర్వాత మంగతాయారు గుడి మెట్లెక్కి, వరదాచారి బుగ్గలకింత మంచి గంధం పూసింది. వెంకటస్వామి మంగతాయారు చెయ్యి పట్టుకొని లాగుతూ, "ఇలా అడ్డమైన వాళ్లకీ గంధాలు పూస్తూ కూర్చుంటే మేళం జరిగినట్టే! సంబరం కదిలినట్టే!" అన్నాడు. మంగతాయారు వెంకటస్వామి చెయ్యి విదిలించుకొని, తన మేజువాణిలో కలిసిపోయింది. సంబరం సాగిపోయింది. ఈ విషయం జనం అంతగా పట్టించుకోలేదు కాని, వరదాచారికి తల కొట్టేసినట్లయింది. బిక్క చచ్చిపోయిన ముఖంతో లోపలికి వెళ్లిపోయాడు.

"ఇంకెందుకయ్యా సందేహం? జరిగింది తెలుస్తూనే వుంది కదా!"

"అన్నట్టు వరదాచారి పెళ్లాం ఏడాది నుంచి మంచం పట్టింది!"

"వెంకటస్వామి పెళ్లాం చచ్చిపోయి ఆర్నెల్లయిందనుకొంటాను-"

"వీళ్ల దుంపతెగ! అర్చకులకీ, పూజార్లకీ కూడా సానివాళ్లు కావలసి వచ్చారు!-"

"వాళ్లు మట్టుకు మనుష్యులు కాదుటయ్యా? ఉప్పూ కారం తింటూ మడి కట్టుక్కూర్చోమంటే ఎలాగయ్యా?"

"ఇంకనేం! వీళ్లిద్దరూ కూడా మంగతాయారు ప్రియులన్నమాట! అయినా వెంకటస్వామి వెర్రికాని, వేశ్య అన్న తర్వాత ఒక్కణ్ణే నమ్ముకొని కూర్చుంటుందా?"

"ఏదో మనలాంటి వాళ్ళకేనయ్యా పాపభీతి! దేవాలయాల్లో ఉంటూ వీళ్లిటువంటి పనులు చేస్తున్నారంటే..."

గంగరావి చెట్టు తిన్నె మీద కూర్చున్న జనం, కారణాల తోరణాలు కట్టుకొంటూ పోయింది. రెండింటికి, వాళ్లకీ విసుగెత్తి ఇళ్ళకు పోయారు. సంధ్యవేళకల్లా, ఆ ఊరంతా ఇదే చర్చ!

మంచాన పడి వున్న వరదాచారి పెళ్ళాం మొగుణ్ణి నిలదీసి అడిగింది.

"నిన్ను ఎలా నమ్మించడమో తెలియట్లేదు. ఆ రాముడి సాక్షిగా చెబుతున్నాను.

జనం అనుకొంటున్నట్లుగా ఆ మంగతాయారుకీ, నాకూ ఏ విధమైన సంబంధమూ లేదు. మా దెబ్బలాటక్కారణం కూడా అది కాదు..?"- నెత్తీ నోరూ బాదుకొంటూ, వరదాచారి ఎంతగా చెప్పినా, పెళ్ళాం నమ్మలేదు.

"తరతరాలుగా అమ్మవారి నీడలో బ్రతుకుతూ వచ్చాం. నీకిదేం పొయ్యే కాలంరా? ఊరి వాళ్ళకింక ఎలా మొహం చూపించి బతికేది?"- వెంకటస్వామి ముసలితండ్రి, కొడుకు మీద విరుచుకుపడ్డాడు. బండరాయిలా నిల్చుండిపోయాడేకాని, వెంకటస్వామి తండ్రి కెదురు సమాధానం చెప్పలేదు.

మూసలో బంగారాన్ని కరిగిస్తున్న కంసాలి వీరాచారి విస్తుపోయాడు. 'ఈ జనం గొర్రెల మందలాంటిది' అని సణుక్కొన్నాడు. అమ్మవారి జాతరయిన మర్నాడు సాయంత్రం-

వెంకటస్వామి ఓ ఏడెనిమిది వెండి కళ్ళూ, రెండు వెండి గరగలూ తీసుకొని; వీరాచారి దగ్గరకు వెళ్లాడు. ఆ వెండినంతా కరగబెట్టి, రూపుమార్చి వీరాచారి దాన్ని అమ్మి వేయడానికి - వచ్చిన డబ్బు ఇద్దరికీ చెరిసగం - ఇదీ వాళ్ల ఒప్పందం. వెంకటస్వామికి తాగుడికి డబ్బు చాలకపోవడంతో, ఈవిధంగా పెడదారులు తొక్కవలసి వచ్చింది. అయితే వాళ్లిద్దరూ ఈ విషయమై మాట్లాడుకొంటుండగా, అక్కడికి వరదాచారి వెళ్లాడు. వరదాచారిని చూసేసరికి వాళ్ళిద్దరూ కంగారుపడి పోయారు. వాళ్ల ముందర పడివున్న వెండి వస్తువుల్ని చూసి, వాళ్ల మధ్య జరుగుతున్న లావాదేవీలు గ్రహించడానికి, వరదాచారి కాట్టేసేపు పట్టలేదు.

మంచం పట్టిన పెళ్లాం రోగం నయమవడం కోసం, వరదాచారి చాలా డబ్బు ఖర్చు పెట్టవలసి వచ్చింది. ఉన్న డబ్బంతా అయిపోవడంతో, వేరు దారి లేక, పెళ్లాం రెండు పేటల బంగారపు గొలుసుని అమ్మివేయడానికి నిశ్చయించాడు. వరదాచారి పెళ్ళానికి బంగారమంటే, ప్రాణం కంటే ఎక్కువ. గొలుసు అమ్మివేస్తున్నాడని తెలిస్తే వరదాచారిని సుఖంగా బతకనియ్యదు. అందుకని అదే రకం యిత్తడి గొలుసును, బంగారపు పూతతో చెయ్యమని వీరాచారికి పని పురమాయించాడు. తమ బంగారపు గొలుసుకు మంచి బేరం చూడమని, వీరాచారికి చెప్పాడు. గొలుసు తయారయిందని అంతకు రెండు మూడు రోజుల క్రితమే, వీరాచారి వరదాచారికి కబురంపాడు. వరదాచారికి ఆ రోజే తీరుబడి దొరకడం వల్ల, ఆ సాయంత్రం వీరాచారి యింటికి వెళ్లాడు.

కళ్ళ ముందర చూసినదాన్ని గురించి వరదాచారి ఏమీ మాట్లాడలేదు. వీరాచారి తను చేసిన గొలుసు వరదాచారికి యిస్తూ, "ఇది ఇత్తడి గొలుసని ఎవరూ కనుక్కోలేరు! పక్క ఊరి నుంచి ఓ బేరం వచ్చింది. మీరా బంగారపు గొలుసు యిస్తే, మెరుగు పెట్టి వాళ్ళకమ్మి పెడ్తాను" అన్నాడు. తనన్న మాటలు ఎటువంటి సంఘటనలకి దారితీస్తాయో నని వీరాచారి ఆలోచించలేదు. వెంకటస్వామి, వరదాచారి కూడా తనలాగే గుడి తాలూకు ఏదో వస్తువు మాయం చేస్తున్నాడని అనుకొన్నాడు. ఉండబట్టలేక అనేశాడు. "నా కంటే నీదే లాభసాటి బేరమయ్యా! అయినా రామాలయానికి రామాలయమే, గోగులమ్మ గుడి గోగులమ్మ గుడే!"

-- అంతక్రితం రోజునే మంగతాయారు విషయంలో, వెంకటస్వామి తన్నవమాన

పర్చినందుకు, వరదాచారి కుతకుతలాడిపోతున్నాడు. వెంకటస్వామి యీ మాటలనడంతో, కోపం రెచ్చిపోయింది.

"నీలాగా అమ్మవారి సొమ్ము అమ్ముకోవడానికి రాలేదు. నా సొమ్ము నేనమ్ముకొంటున్నాను" అన్నాడు వరదాచారి తీవ్రంగా.

"ఇది నువ్వంటూన్నమాట! నిజం ఎవరికి తెలుసు?" వెంకటస్వామి వెటకారంగా అన్నాడు. మాటా మాటా పెరిగింది. కొట్టుకోడానికి సిద్ధమయ్యేసరికి, వీరాచారికి వణుకు పుట్టింది. "మీ తగువులాట మాట దేముడెరుగు కాని, మీరు ఊరుకోకపోతే మనందరం కటకటాల వెనక్కి వెళ్ళవలసి వస్తుందని" భయపెట్టి, ఎలాగో వాళ్ళిద్దరూ కలియబడకుండా ఆపుచేశాడు. వరదాచారి, వీరాచారి చేసిన యిత్తడి గొలుసు అతడి మొహాన్నేసి కొట్టి, వెళ్ళిపోయాడు.

అయితే ఆ రోజు ఉదయం వరదాచారీ, వెంకటస్వామీ ఒకరికొకరు చెరువు గట్టు మీద, గంగరావి చెట్టు దగ్గర ఎదురుపడ్డంతో జుట్టూ జుట్టూ పట్టుకొన్నారు.

కంసాలి వీరాచారి, వాళ్ల దెబ్బలాట విషయమై ఎవరితోనూ చర్చించలేదు.

సానివాడలో సందు చివరి మేడలో తల్లో మల్లెపువ్వులు తురుముకొంటూన్న మంగతాయారు, తల్లి మోసుకొచ్చిన వార్త విని, "చిత్రంగా వుందే! వాళ్ళిద్దరూ జన్మలో కూడా మన గడప తొక్కలేదు! ఆ రోజునేదో గౌరవంగా ఉంటుందని ఆచారిగారికి గంధం పూశాను. ఏదో తాగుడు మైకంలో వెంకటస్వామి అలా తడువుకుని ఉంటాడు. మరి ఈ రోజు వాళ్లకింత దెబ్బలాట జరగడం, దానికి కారణం నేనని ఊరంతా అనుకోవడం, నాకేదో భయంగా ఉంది!" అంటూ తల్లడిల్లిపోయింది.

పాతికెకరాల మామిడితోటలో ఉన్న బంగళా వరండాలో, విస్కీ సేవిస్తూ, కోడి పలావు ఆరగిస్తున్న సోమప్ప దొర, నోట్లో ఉన్న విస్కీని తుపుక్కున ఉమ్మేశాడు, పాలాయిగాడు చెప్పిన మాటలు వింటూనే. దొర కోపాన్ని చూసి పోలాయి గాడక్కణ్ణుంచి జారుకొన్నాడు. "దొంగనాయాల్ది! నా ఒక్కడి ప్రాపకంలో ఉండడం కోసం నెలకి ఆరు వందలు దాని మొహాన్న కొడ్తూంటే, అది అడ్డమైన వాళ్లతోటీ తిరుగుతోంది! ఆ వెధవ నాయాళ్లకి ఎంత పొగరు!" అంటూ బుసలు కొట్టాడు.

మరుసటి రోజు చింతతోపులో పోలీసులూ, జనమూ గుమిగూడారు. వరదాచారీ, వెంకటస్వామీ బుర్రలు బ్రద్దలయి ఉన్నాయి. కొంచెం దూరంలో మంగతాయారు దేహం పడి ఉంది.

"వీళ్ల అఘాయిత్యం మండిపోనూ! నిన్న జరిగిన దెబ్బలాట చాలకనా!"

"అయినా సానిదాని కోసం, యిలా ఒకరి ప్రాణాలు మరొకరు తీసుకోవడం!"

"వాళ్లు ఒకర్నొకరు చంపుకొన్నారు, బావుందయ్యా! పాపం మధ్యలో అదేం చేసిందని? దాని వ్యాపారం అది చేసుకోవద్దూ?"

జనులు రకరకాలుగా అనుకొన్నారు. ఈ చావులకి కారణం వాళ్ల నోళ్లేనని, ఆ జనులకి తెలియదు! తెలిసిన సీతారాములకీ, గోగులమ్మకీ నోళ్లు లేవు! ●

*('ఆంధ్ర సచిత్ర వార పత్రిక' : 13-5-1977)*